

అవసరాల రామకృష్ణారావు

# దైవకార్యం

ఒక్క ఊపుతో రైలు కదిలి క్రమంగా వేగం హెచ్చించింది. ఆ ఊరు, దానితో ముడివేసుకుపోయిన నా ఆరు నెలల జీవిత దృశ్యమూ ఒక్కసారి నా మనసు నుంచి చెరిపివెయ్యడానికీ, దూరం చెయ్యడానికీ, వెర్రి రైలు. దీనికెన్ని గుండెలు!

అప్పుడూ ఇలాగే టిక్కెట్టు లేదని ఆ స్టేషన్‌లో దింపేశారు. ఊళ్ళోకి వెళ్ళి వీధులన్నీ వెర్రెత్తినట్టు తిరిగినా విస్తరేసే అదృష్టం కనబడలేదు. ఉసూరుమంటూ ఓ అరుగుమీద చేరేశాను శరీరాన్ని. కళ్ళు తిరిగినట్టయింది. అప్పుడే ఎంగిలాకు పారేద్దామని ఓ ఇల్లాలు అరుగుమీదికి వచ్చింది, నన్నా స్థితిలో చూసింది. నేను కూడా ఓ ఎంగిలాకు లాంటి వాణ్ణని ఆవిడకు తెలీదు కాబోలు. లోపలికి పిలిచి అన్నం పెట్టి ప్రాణం నిలబెట్టింది. అమ్మగారితో అనుబంధం అలా మొదలై ఆ ఊళ్ళో ఉండగా మరి తెంపుకోలేనంతగా బిగిసిపోయింది.

అమ్మగారి నాన్నగారుట అక్కడే వాడి యింట్లోనే ఉంటారుట. నా గురించి అన్నీ అడిగేరు. కులం శాఖా అన్నీ వాళ్ళవీ నావీ ఒకటేనుట. ఆ వాళ్ళు వెయ్యి తరాల నుంచి వాళ్ళ వాళ్ళకి పౌరోహిత్యం చేసే వారుట.

"ఆ భారీ శరీరం, ఆనుదుటి ముక్కు చూసి అప్పుడే అనుకున్నాను. వీళ్ళ తాత దీక్షితుల్ది ఇదే మొహం. వాళ్ళ వాళ్ళంతా ఎంత వైదికులనీ! ఇప్పుడంటే కాలం ఇలా తిరగబడిందిగాని ఆ రోజుల్లో దైవజ్ఞులు వచ్చి దేవతార్చన చేస్తేగాని ఇంటి కార్యక్రమం ఆరంభం అయ్యేదా మరి? నీ వేషం వాలకం చూస్తే తండ్రి దొక్కశుద్ధి నీకేం అబ్బినట్టులేదే! అయినా ఆ వంశంలో పుట్టిన మొలకవి. వర్చస్సు ఉంది, మంచి కంఠం ఉంది. ఎంతలో నేర్చుకోగలిగే — అవునే అమ్మాయ్ ఇతన్ని మనింట్లో ఉంచేసుకుంటేనో? అల్లుడురాని. అడుగుదాం .... ఏమంటావోయ్ నువ్వు?"

మౌనమే నా అంగీకారమైందేమో .... వేన్నుంచైతే పారిపోదామనుకున్నానో అదే నన్ను వెంటపెట్టడంకన్న ఆశ్చర్యమేముంది! నాన్న ఎంత ప్రయత్నం చేసినా యీ వైదిక వృత్తికి నా మనస్సు ఎంతమాత్రం ఒడబడలేదు. ఆ మంత్రం ముక్కలు నా నోట పలికిద్దామని తను ఎంత గింజుకున్నా అవి స్పష్టంగా నా నుంచి ఊడిపడి చావలేదు. అది తన పరాజయంగా అంగీకరించలేక చావగొట్టేశేవాడు. ఆయనలా గొడ్డుని బాదినట్టు బాదుతున్నకొద్దీ అమ్మలేని బాధకంటే నాన్న బతికుండిపోయాడే అనేబాధ నన్ను క్రుంగదీసేసేది. అక్క లేచిపోయిందనే చింతకంటె అయ్యో నేను ఆడదాన్ని కాకపోయానే, నాకిదా ఆ అవకాశం దొరికి ఉండునే" అనే దుగ్ధ నన్ను కాల్చేసింది. నాకు పదిహేడేళ్ళ వెళ్ళే వరకూ నాన్న బతికాడు. ఆయన చెప్పిన చదువు నాకేం వంటికెక్కలేదు గాని, ఆయన గుమ్మం దిగనిచ్చి తలుపు గడియపెట్టుకుని. ఏమంటే అది ఉడకబెట్టుకునో వేయించుకునో ఇంత కారమో పంచదారో జల్లుకుని మింగడం మాత్రం అలవాటు చేసుకున్నాను. అసలు నాన్న ఓపూట నాచేత వండించేవాడుకూడా. వండుతున్నప్పుడే తినదగు ఎయ్యది దొరికిన అన్నట్టు సగం వంట వంటకిందకి రాకుండానే వంటికింపకి వెళ్ళిపోయేది. ఎలా అయితేనేం వారం వర్జ్యం చెప్పే యాయవార బ్రాహ్మణుడిగా కాకపోయినా వంటబ్రాహ్మణుడిగాఅయినాకితాబుతప్పలేదు నాకు.

నాన్న చావగొట్టి మరీ చెప్పడంచేతో యేమో శుభం కానివ్వండి అశుభం కానివ్వండి యీ ప్రక్రియలమీద మొదట్నుంచీ ఎంతో అసహ్యం ఏర్పడి పోయింది నాకు. ఈ తిరుగుబాటు ధోరణి నా వయసుతో పెరిగిందేకాని తగ్గలేదు. ఈ పూజలూ, వ్రతాలూ మొక్కుబళ్ళూ, తద్దినాలూ అన్నీ ఎంతో హాస్యాస్పదంగా కనిపించేవి నాకు.

కొన్ని కర్మలూ, కొన్ని విద్యలూ, కొన్ని క్రతువులూ కొందరికే పరిమితం అయితే మిగిలినవాళ్ళు ఏంకావాలి! ఉచ్చారణవల్లే ఊర్ధ్వలోకాలు లభించే అవకాశం వుంటే మూగవాళ్ళు ఏ గంగలో కలవాలి! ఎవరి కర్మ వారిదే అయితే ఆడదిచేసే వ్రతిపూజా మొగుడికోసమే ఎలా అవుతుంది? చాలా మంది ఆడాళ్ళకి మొగుడు బతికుండడమే గొప్ప శిక్ష. అతగాడు అవతారం చాలించాక కూడా కొత్త రకం కొరత విధింపబడడం ఏం న్యాయం ?

"అర్చన" వికృతి "అర్జన" ప్రకృతి అనేవాడు నాన్న. గుళ్ళో కుదురుకుంటే యింత ప్రసాదం తినిపడుంటాడని ఆనాఖరీ కోసం నాన్నచేసే ప్రయత్నాలు కూడా నాకు నచ్చలేదు. గొప్పదనంమాట తనే ఎరుగు, లోపంలేని దేవుడే నాకు కనపడ్డలేదు! కొండమీద కూర్చుని కాల్లగొడుతున్న ముఖ్యులు ముగ్గుర్నే తీసుకుందాం. ఇద్దరు పెళ్ళాలకి జవాబుచెప్పలేక నల్లరాయిగా మారిపోయిన ధైర్యశాలి ఒకడు; తమ్ముణ్ణి చంపేటని అభిమానంగల ఓ అన్న వగబడితే, దారుణంగా హత్యచేసిన దయామయుడు ఒకడు; ఇష్టం ఉండొచ్చు ఉండకపోవచ్చు, తన ప్రసాదం నోట్లో వేసుకోలేదని అలిగి, భక్తుల నోట్లో మట్టికొట్టిన విశాల హృదయుడు ఒకడు! ఏ దేవుడూ మనిషిలా ఉండడు. మనిషిలా ప్రవర్తించడు, అలా ఉంటే మనిషే గుర్తించడని కాబోలు. అయినా ఒకరిచేత గుర్తింపబడాలనే దేనిరింపు దేనికి దేవుడికి! ఫలానా వ్రతంచేస్తే ఫలానా లాభం కలుగుతుందని చెప్పడమే పత్రికలో ప్రకటన లాంటిది. అలా చెయ్యకపోతే ఎంత కీడు కలుగుతుందో చెబుతూ పరోక్షంగా శాపనార్థాలు పెట్టే భక్తి సాహిత్యం బ్రహ్మాండమైన ప్రచార సాధనంకాదా!

ఇంటి దగ్గర నాన్న దెబ్బలే యింతటి వసుకున్నాను. నాన్న పోయాక, ఆ శాస్త్ర పొలమూ అమ్ముకుని ఆ రెండేళ్ళు ఏం అనుభవించానో అంతే. పొట్టచేత్తో పట్టుకుని మధిలో కాలు పెట్టాకనే తెలిసింది. ఎవరు దెబ్బల రుచి ఎలాంటిదో. నా ఆలోచన అనుభవమూ నాకు నేర్పిన పాఠం ఒక్కటే. మన వాళ్ళకి నాటి మనిషి కష్టసుఖాల చరిత్ర కన్న కనబడని దేవుళ్ళ పురాణాలమీద గురి ఎక్కువ. ఊపిరితీస్తూ తనతో మాట్లాడుతూ రక్తమాంసాలతో ఎదుట నిలబడ్డ మనిషికన్న ఏ కర్రతోనో రాతితోనో చెక్కిన ఎక్కడోఉన్న ఏ విగ్రహంమీదో మోజు ఎక్కువ. నిప్పులా కాలుతుంది కాబట్టి నిజమంటే మంట. తమాషాగా ఉంటుంది కాబట్టి మాయఅంటే మక్కువ. సమస్త మానవజాతితారాబలమూ ఒకేఒక్క వేలిలా చెపుకోగలరు. సర్వరోగ నివారణ శక్తి చిటికెడు బూడిదలో ఉందని నమ్మగలరు. అలాగే ఉండిపోవాలని నిశ్చయించుకున్నారు గనక వీళ్ళని జోకొట్టి డబ్బు చేసుకోడంలో తప్పేంలేదు.

అందువల్లనే యేమో అక్కడ చేరిన మూడో నెలకే ఆ ఊరిచివర దేవాలయ నిర్మాణంలో నేను ప్రముఖపాత్ర వహించ వలసి వచ్చింది!

అంతకంటె విచిత్రమైన సంగతేమిటంటే ప్లీడరుగారింట్లో అమ్మగారికి వంటపనిలో సాయంచెయ్యడమే కాకుండా ఏ రోజు కారోజు పూజాసామగ్రి అమర్చడం! అన్ని రకాల వ్రతాల, నోముల పుస్తకాలు ఆ యింట్లో వుండేవి. తాతగారికి సరిగ్గా కళ్ళు కనిపించక నా చేత చదివించేవారు తప్పు చదివితే సరిదిద్దేవారు.


ఎందుకోగాని అమ్మగారి ముఖంలో ఎప్పుడు చూసినా ఆనందమనేది నాకు కనపడేది కాదు. చాలా మంది పిల్లలు పుట్టి పోయారని పనివాళ్లు చెప్పేరుగాని, అదే అన్నిటికీ మూలంలా నాకు కనిపించలేదు. ప్లీడరుగారు వేలకి వేలు డబ్బు సంపాదించే వారు. ఎంత రాత్రి గడిచినా యింటికి వచ్చే వారు కారు. వాళ్ళిద్దరూ నవ్వుతూ మాట్లాడుకోవడం నేనెప్పుడూ చూడలేదు.


అందరూ చావగా మిగిలిన అమ్మాయి, బేబీ అంటారు ఒకర్తె లేకపోలేదు. హైస్కూల్లో పదో క్లాసు కాబోలు చదువుతోందంటారు. ఎప్పుడూ పత్రికలోంచి మొహం బయటకి తియ్యదు. తీసి బయటకి ఎత్తితే, అది ఒక్క సినిమా హాలులోనే!

నేను ఆ యింట్లో చేరిన రెండో నెలకే తాతగారు పోయారు. దాన్తో అమ్మగారు మరీ డీలా పడిపోయారు.

"నా మెడకి ఇదొకత్తి మిగిలింది. లేకపోతే ఎప్పుడో వెళ్ళిపోయివుందును. ఎదిగి కూచుందిగాని ఏమీ ఎరగని వెర్రిపిల్ల.... దీని బతుకు ఎలా వెడుతుందో ఏమిటో" అనేవారు అమ్మగారు అస్తమానమూ.

మావగారు పోయాక ప్లీడరుగారికి దుక్కముక్కలాంటి నన్ను ఊరికే యింట్లో కూచుని మేపడం యిష్టంలేకపోయింది.






ఆలోచించాడు. ఆ తర్వాత ఊరి చివర, రోడ్డువార, పాకలోకి మార్చబడింది నా మకాం. అక్కడ చెట్టుకింద ఆంజనేయుడి విగ్రహం ఏ ఏళ్లై ఏళ్ళ నుంచో ఉంది. ఆ విగ్రహం ఎండకి ఎండుతూ వానకి తడుస్తూ ఉండిపోయిందనే విషయం హఠాత్తుగా ప్లీడరుగారి బుర్రకి ఎక్కికూచుంది.

ఆయన నవ్వుతూ అన్నారు.

"కలవచ్చి పడిందయ్యా, ఏం చెయ్యను మరి! కల అనేది కాదనలేనిది, టెలివిజన్ కాదు గదా! స్వామి కనిపించి కోపించాడు- ఇన్నేళ్ళయినా నాకు గుడి కావాలని మీ ఊరి వాళ్ళకి పట్టలేదా అని! తప్పుతుందా మరి! అన్ని బస్సులూ వెళ్ళేది అదే రూటున- అన్ని మనస్సులూ పట్టుబడాలని పట్టుపట్టేది కూడా అలాంటి చీకటి మాటునే. శక్తికొలది పనులు చెయ్యి ప్రయాణీకుల దగ్గర్నుంచి. అందులో సగభాగం పూజారివి నీవే. కండక్టరికో పావలా వాటా పారేస్తే కథ అడ్డం తిరగదు. భక్తి మాట దేవుడెరుగుగాని ప్రజలకైనా జవాబు చెప్పుకోవాలి గదా! గుడి కోసం ఓ పావలా చొప్పున వేరేదాస్తుండు, మమ్మల్ని మరచిపోయావు, అమ్మగారు అసలే గాలిలో దీపంలాంటిది. కాకి చేత కబురంపించినా రెక్కలు కట్టుకు వాలాలి సుమా! ఇలా అప్పుడప్పుడు చేసే పంట పనికి మాత్రం నీకు కూలి ఏర్పాటు ఉండదు. నీ రాబడిలో నేను వాటా అడగను ఇది మనిద్దరి మధ్యా కంట్రాక్టు- వింటున్నావా?"

ఆయనంత ఖచ్చితంగామాట్లాడుతూంటే ఎంతో దగ్గరై నట్టనిపించింది. కాని అమ్మగారికి నాకూ దూరంచేసింది యీయనేకదా అనిపించి అభిమానం ఆట్టేసేపు నిలబడలేదు. అలా ప్రారంభమైంది గుడిలో లింగాన్ని మింగే నా వ్యాపారం.

ఆ మధ్య లారీ ఒకటి ఆ జాగాకి సుమారు రెండు మైళ్ళ దూరంలో ఓ చెట్టుకి గుద్దుకుని డ్రైవరూ, క్లీనరూ నామరూపాలు లేకుండా పిప్పి పిప్పి అయిపోయారు. అసలు ఆరోజు వాళ్ళిద్దరూ పాకదగ్గర లారీ ఆపి చెరో రూపాయి డబ్బీలోవేసి ఇంతంత కుంకం బొట్లు పెట్టుకుని మరీ వెళ్ళారు. శవాలు సాక్ష్యం చెప్పలేవుగదా! చూశారా, ఒక్కమాటు కళ్లు మూసుకుని దండం పెట్టుకోకుండా వెడితే రెండు నిండు ప్రాణాలు నిలువునా ఎలా బలైపోయాయో. మీ కిష్టమైతే ఓ పైస వెయ్యండి. లేకపోతే లేదు. స్వామికోరేది ఏమిటి? ఒక్క నమస్కారం. అదైనా ఎవరికోసం? మా పిల్లాపాపా చల్లగా ఉండాలని, ఇలాంటి అపకాళ వాదాలతో మరింతగా నా ధర్మ డబ్బీ ఉక్కిరి బిక్కిరి అయిపోయేది.

ఓ రోజు ఆ చిల్లర డబ్బీ పసుపుచీర చుట్టబెట్టుకున్న జేగురు చుక్కల గలగల లక్ష్మి- నాకు కనిపించలేదు, పైగా పక్క-సాకలోంచి కిం... వినిపించింది. అది అంట్లు తోమే అప్పల్నర్సిది. ఎలా సంపాదించాలనే విషయంలో నా కాట్టే పట్టింపు లేనట్టే ఎక్కడ సుఖపడాలో విషయంలో అప్పల్నర్సికి ఆట్టే పట్టింపు ఉన్నట్టు లేదు. దాని చురుకు చురుకు చూపులే ఏ మొగాడికయినా ఉడుకు ఉడుకు కబురులు. పైగా నవ్వుల సిగ్నల్ ఇచ్చింది. ఈ విద్య ఇదివరకు నే నెరగంది కాదుగదా! ఆకలి వేరయినంత మాత్రాన వంటలు మారవాలా!

ఈ పూజారి పుండాకోరు బతుకు నా మనసుకి పడదు. కాని అనేక రకాల సంఘర్షణకి లోనై ఆఖరికి ఇక్కడ చేరుకున్నాను. ఇప్పుడిప్పుడే అన్ని రకాల సుఖాలూ అమరుతున్నాయి. దీన్ని వదిలిపెట్టడం మంచిది కాదని శరీరం మారాం చేసింది. ఓ జందెపు పోగూ, ఓ విభూతి పండూ, సామాన్య ప్రజలకి అర్థంకాని భాషలో అప్పుడప్పుడొక మంత్రమ్ముక్క- చెప్పగలిగే శక్తి ఏ పరిస్థితినయినా మరో పైసా డబ్బీలో పడేలా మార్చి నోరెట్టుకు బతకగల ఉపాయం-ఇవీ నా పెట్టుబడి. దివ్యంగా సాగిపోతోంది వ్యాపారం. చింతదేనికి! అందులో యీ మధ్య అప్పల్నర్సి- నేను కొన్ని నెలల వెనక పెట్టిన మందు కొట్టడం కూడా మప్పింది. అదే నా చేత ఆనాడు అంత దుర్మార్గపు పని చేయించిందేమో!

ముందురోజు గాలివానకి రోడ్డుకడ్డంగా చింత చెట్టు పడిపోయిందని తాత్కాలికంగా రోడ్డుమలుపు తిప్పేడు. అది బాగుచేసేదాకా బస్సులు మా పాకమీంచి వెళ్ళవు. ఓ పూటదాకా నాకు వండుకోవడం, తినడం తప్ప మరో పనిలేదు. చిన్న చలిగాలి వేస్తున్నది. మిటమిటటి వేళ. అక్కకూతుర్ని ఆస్పత్రి పెట్టేరని తెలిసి. అప్పలనర్సి మధ్యాహ్నమనగా వెళ్ళిపోయింది. ఇలాంటప్పుడు తను దగ్గర్లేకపోతే నన్నే ఆస్పత్రిలో పెట్టాలేమో అనిపించింది. లోపలికెళ్ళి సీసా ఖాళీచేసి వచ్చానులేని హుషారుతెచ్చుకోడం కోసం గుమ్మంలో కూర్చుని గుప్పు గుప్పుమని చీరమీద బీడీ వదుల్తున్నాను.

పరుగుపరుగున ఆ అమ్మాయి ఆవేళ నాదగ్గర కెందుకొచ్చిందో నేను అడగలేదు. ఆ స్థితిలో నిజానికి అడగడంఎలాగో నాకు తెలీలేదు, ఆ అమ్మాయి అడ్డుచెప్పనూలేదు. ఎగిరెగిరిపచ్చి యాపిల్‌పండు ఒళ్ళోపడింది

తీసుకు తింటే తప్పా? తప్పేనని తిన్న తర్వాతగాని తెలిసేదు!

ఆ అమ్మాయి మరెవరో కాదు, ప్లీడరు గారి దేవి! ఆయన హైకోర్టు పనిమీద ఊరెళ్ళేరుట. ముగ్గురు పనివాళ్లు ఆ రోజు రాలేదుట .... అమ్మగారికి మళ్ళీ ఒళ్ళు తెలియని జ్వరంలో మరెవరూ లేక నన్ను పిలవడానికి తనే వచ్చింది దేవి.

తొందర తొందరగా అమ్మాయితో వాళ్లుళ్ళి చేరేను. దార్లోనే డాక్టరుగారిల్లుంటే చెప్పికూడా తీసికెళ్ళేను. అమ్మగారికి యింజక్షన్ యిప్పించాను. వేరే ఏవో మాత్రలు కావాలంటే మళ్ళీ బజారుకొచ్చి తెచ్చి యిచ్చాను. ఇంటిపనే కాక వంటపని కూడా పూర్తిచేసి అన్నీ ఎక్కడి వక్కడ సర్దేసరికి అర్ధరాత్రి దాటిందనుకుంటాను.

"పనిని చేస్తున్నా, చేసిన అఘాయిత్యానికి అనుభవిస్తున్న పశ్చాత్తాపం నన్ను దహించక మానలేదు. ఇలాంటి పని చెయ్యడం బ్రహ్మాండం కాదు" అంటాం మనం మామూలుగా. నిజానికి మాతురిలాంటిదాంతో కులకడం బ్రహ్మాతరం మాత్రమే అవును. ఇంతకు ముందిన పాపం చేశాను, ఒకర్ని వేలెత్తి చూపడం దేనికి! పదహారేళ్ళకే పాత రేళ్ళ దాన్లా కనపడవచ్చు. ఛీ ఛీ అంటే చిరునవ్వులు వెలిగించే పాపాయిలాంటి మనసు దేవిది. ఆమెకేనా యిలాంటి కిరాతకం!

నిద్రాగా ఉన్నప్పుడు బీడీలు తగలెయ్యడం చిన్నప్పట్నుంచి అలవాటునాకు. ఆఖరికి అది కూడా మరచిపోయి. సిగ్గుతో తల మోకాళ్ళమధ్య దూర్చి యించుమించు ఏడుస్తూ కూచున్నాను ఆ నిశిరాత్రివేళ, ఆ మేడమీది వరండాలో మెట్లగది తలుపు అడ్డ గడియ వేసేసి దేవి, పట్టీల చప్పుడు రాకుండా, నా వైపు మెల్లిగా నడిచి వస్తూంటే నిర్ఘాంతపోయాను.

"అమ్మకి నిద్ర పట్టేసింది. పద, ఆ మూల గదిలోకి పోదాం. అబ్బ రమ్మంటోంటే" అని చెయ్యిపట్టుకు లాగుతూంటే ఉన్నమతికూడా పోయింది!

ఉన్నట్టుండి తెలివి తెచ్చుకుని, ఆమెను



విడిపించుకున్నాను. మేడ దిగి కిందకివచ్చేశాను. అమ్మగారి మొహంలోకి చూడగల ధైర్యం ఎప్పుడో కోల్పోయాను నేను. నిద్రమందు పట్టిచ్చినట్టుంది. పెద్ద గుండె వినపడుతోంది. ఆ శబ్దానికే పట్టుపడి పోయినట్టు నిలు వెల్లాఒణికిపోయాను. వరండాలోకి వచ్చి కూర్చున్నాను, వీధి లైటు వెలుగుపడేచోట. ఆ లైటువైపు చూస్తె తెలుస్తుంది, చుట్టూ ఎంత చీకటిగాఉందో... అలా చూస్తేనే తెలిసింది, వర్షపుజోరు ఏమాత్రం తగ్గలేదని....ఇటువైపు చూసే తెలిసింది ఈ అమ్మాయి జోరుకూడా ఏమాత్రం తగ్గలేదని, దగ్గరగావచ్చి రెండు చేతులూ నామీద వేసింది. కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"ఎందుకలా వచ్చేశావ్, నేనంటే యిషం లేదా?" ఎలా, ఎలా, చెప్పను! ఎలా చెప్తే తెలుస్తుంది! ఆ ఉవ్వెత్తు మబ్బుల వెనక ఉన్నది కేవలం చిన్నారి చందమామే అని! అ వెలుగురేక కోసమే ఓ తల్లి పంచప్రాణాలూ పెట్టుకుని బతుకుతోందని! జరిగిన దానికే కుమిలి కుమిలి ఛస్తున్నాననీ, యింకోసారి యిలాంటి దానికి పాల్పడ్డంకంటె పురుటిగుడ్డుని పీకపిసికి చంపడం నయమనీ–ఎలా చెప్పను!

ఎలాగో చెప్పాలిగా....ఇది మహాదారుణమనీ, జరిగిందాన్ని మరచిపోమనీ, మంచి సంబంధం చేసుకుని హాయిగావుండమనీ.... నచ్చజెప్పడానికి ప్రయత్నించాను. పత్రికలూ, చలనచిత్రాలూ అ అమ్మాయిని జీవితం నుంచి ఇంతదూరం తీసుకుపోయాయని బేబీ మాటలు వింటేగాని నాకు తెలీలేదు. ఈ దేశంలో ఆడది జీవితంలో ఒకే ఒకసారి ప్రేమించగలదండి. తనువు ఒకరికీ మనసు ఒకరికీనా, ఇంత తక్కువగానా నువ్వు స్త్రీమూర్తిని అంచనా వేసేది, అని నిలదీసింది. నీ పదధూళి చాలు, శిరసున ధరిస్తాను. అంది. కాదన్నా పోనీ పాదాల దగ్గరే తల బద్దలుకొట్టుకు చస్తానంది. ఏమనుకున్నావ్. పెళ్ళంటే వెయ్యేళ్ళ పంట సుమా అని హెచ్చరించింది. అరిటాకుమీద ముల్లు పడినా ముల్లుమీట అరిటాకు పడినా అరిటాకుకేకదా నష్టం, నీకేం! అని నిలబెట్టేసింది.

ఇలాంటి ధోరణికి జవాబింటూలేదు. అయినా నేను ఊరుకోలేదు. "ఏ అయినింటికో కోడలిగా వెళ్ళి పిల్లాపాపతో కళకళలాడవలసిన దానివి. నాతో నీ కేమిటి తల్లీ" అని నచ్చజెప్ప ప్రయత్నించాను. "పొరపాటున ఓ పిచ్చిగీత పడినంత మాత్రంచేత తెల్లకాగితం బతుకు ఆ గీతకే అంకితం అయిపోనక్కర్లేదు. ఎంతటి సిరామరకయినా కనపడకుండా చెరిపే రబ్బర్లు దొరక్కపోవు. ఇది పొరపాటు. దీన్నొక స్థిరమైన నేరంగా రూపొందించి బతుకు బండలు చేసుకోనక్కర్లేదు" అని హితవు చెప్పేను.

ఎన్ని చెప్పనియ్యి – ఆ అమ్మాయి వినే స్థితిలో లేదు. డాడీ నా మాట కాదనరు. ఓ పేళ మొదట్లో అడ్డు చెప్పినా నేను, మమ్మీ కలిసి చెబితే కొట్టి పారెయ్యలేరు. మావాళ్ళకున్న ఒకే ఒక పట్టింపు కులం గురించి. అదృష్టవశాత్తూ ఆ చికాకు మనకి లేదు గదా! నేను గట్టిగా పట్టుబడితే మన పెళ్ళి జరిపించి తీరతారు. ఇక వయసు తేడా అంటావా, ప్రేమ హృదయానికి సంబంధించిందని వినలేదా?" "లేదు బేబీ....మా వాళ్ళు ఒప్పుకుంటారని నేననుకోను." "ఒప్పుకోకపోతే చావమను. వాళ్ళు నా పేరెంట్సూ కాదు, నేను వారి డాటర్నీకాదు. మన బంధం జన్మ జన్మల అనుబంధం.... నీ సన్నిధి నా పెన్నిధి....పద, ఇలా నీతో వచ్చేస్తాను. రిజిష్ట్రారాఫీసుకు వెళ్ళిపోథాం".

"ఆవారాగాణ్ణి. నాతో నువ్వెలా బతుకుతావ్ బేబీ?"

"టట్.... హీరోయేనా ఇలా దీరాలు పలికేది? జీవిత మంటే ఏమిటి, ఒక కంట కన్నీరు, ఒక కంట పన్నీరు...ఆ మాత్రం తెలేదా నీకు? అయినా మా తాతగారు నా పెళ్ళికోసం ముందే ప్రెజెంటుచేసిన వజ్రాల సూట్‌కేసు ఉందయ్యా.... ఇప్పుడిలా వెళ్ళితేనా?"

ఇక ఆ అమ్మాయితో వాదించడానికి నాకేం మిగల్లేదు. ఇక ఆ ఊళ్ళో ఉంటే లాభంలేదని ఆ క్షణమే నిశ్చయించుకున్నాను.

ఆఖరికి ఆ అమాయకురాలి దగ్గర కూడా మోసమే పనిచేసింది. నాన్నగారు రాగానే ఆయనతో మాట్లాడి వీలైనంత తొందర్లో మూడు ముళ్ళూ వేస్తానని నచ్చజెప్పి, అంతదాకా కలుసుకోడం మంచిది కాదని ఒప్పించాను.

నిజానికి ప్లీడరుగారు ఊర్నించి రాగానే నేను చెప్పిన విషయాలు లేవు. మెద్రాసులో ఇదివరకు నేను పనిచేసిన హోటలువాడు–నే నిక్కడున్నానని ఎలాగో తెలుసుకుని మళ్ళీ వచ్చి పనిలో చేరమని కబురు చేశాడనీ–వెళ్ళడానికి నిశ్చయించుకున్నాననీ—చెప్పేను. మొదట్లో ఒప్పుకోలేదుగాని ఎంతో నచ్చచెప్పిన మీదట తను వద్దన్నా నేను వెళ్ళక మాననని గ్రహించి, ఊరుకున్నారు. ఈ సంగతి యింట్లో తెలియనియ్యవద్దనీ, అమ్మగారు అసలు ఒప్పుకోరనీ, బ్రతిమాలి ఒప్పించాను. ఆలయ నిర్మాణానికి వసూలయిన చందాలో మిగిలింది లెక్కచూస్తే అయిదు వందల చిల్లరుంది. మిగిలింది నేను ఉంచుకుంటాననీ, ఇప్పటి వసూలు యింతేనని ఊరివాళ్ళకి తన పలుకుబడి ఉపయోగించి నచ్చజెప్పమని ప్లీడరుగారి చేతిలో మూడు వందలు పెట్టేను. మరొకర్ని చూసి వేసుకోమనీ ఇలా హఠాత్తుగా వెళ్ళిపోతున్నందుకు క్షమించమని మరీ మరీ ప్రార్థించి ఒప్పించాను.

ఎప్పట్నుంచో పట్టుచీర కొనిపెట్టమని అప్పల్నర్సి చంపేస్తోంది. ఈ డబ్బొకది వస్తుందో రాదో తెలీదుగాని ఆ రెండొందలూ దాని చేతిలో పోశాను. చెప్పాలనుకున్నానుగాని చెప్పలేదు. ఇలానే వెళ్ళిపోయానని తెలిసినా భరించగలదు అది. అనేక రకార ఢక్కామొక్కీలు తిన్నఘటం అది. పమిట సర్దుకున్నంత సుళువుగా ఏ పరిస్థితిని అయినా సర్దేసుకోగలదు. ఫర్వాలేదు!

చిల్లర మల్లర తిరుగుళ్ళ వాడ్ని. ఎలా వచ్చినట్టు అలాగే చిల్లర డబ్బులతోనే రైలెక్కేను.

రైలు ముందుకి వెడుతున్నా ఆలోచన వెనక్కి లాగుతోంది. అలా వెళ్ళి వెళ్ళి ఓ దృశ్యం ముందు నిలిచిపోయింది.

ఎండలో సొమ్మసిల్లిన నా మొహంమీద చల్లని నీళ్ళు జల్లి సేదతీర్చి కడుపునిండా తిండిపెట్టింది జీవితంలో సుఖమంటూ ఎరగని ఓ పిచ్చితల్లి. ఫరవాలేదు. ఇప్పుడు తలెత్తి ధైర్యంగా అమ్మగారి మొహంలోకి చూడగలను. ఈ తృప్తినిచ్చిన బలంతో యిక ఎలాంటి ప్రయాణమైనా చెయ్యగలను. ★